క్లుప్తంగా

అవయవ దానంపై అవగాహన



అవయదానంపై కరపత్రం ఆవిష్కరిస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం శ్రీ గురురాఘేంద్ర బ్యాంక్ కోచింగ్ విద్యార్థులకు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ వ్యక్తి జీవించి ఉండగానే ఒక మూత్రపిండాన్ని, కాలేయంలోని కొంత భాగాన్ని దానం చేసే అకాశం ఉందన్నారు. అలాగే మనిషి సాధారణంగా మరణించిన తరువాత ఆరు గంటల లోపు నేత్రాలు దానం చేయవచ్చన్నారు. ఐఎంఏ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఏటా దేశంలో అయవదానం లభించక ఐదు లక్షల మంది మరణిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఆలోచించి అవయవదానానికి తమ వంతు కృషి చేయాలన్నారు. డాక్టర్లు గెలివీ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు జఫ్రుల్లా, లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమేసుల నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత దేశ ప్రగతికి అవసరం



విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): దేశ ప్రగతికి యువత ఎంతో అవసరమని, ఇలాంటి ఫెస్ట్‌లలో పాల్గొనడం వల్ల ఆలోచన ధోరణి మారుతుందని విజ్ఞాన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటారని నంది పైప్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుజలా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో జాతీయ స్థాయిలో జరిగిన డిగ్రీ విద్యార్థుల సదస్సు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్ప్రింగ్ ఫెస్ట్ 2023 నేషనల్ లెవెల్ అండ్ గ్రాడ్యుయేట్ ఫెస్ట్ సదస్సు నంద్యాల పట్టణంలో నిర్వహించడం, దాదాపు 8 కళాశాలల నుంచి 74మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, సెక్రటరీ విజయ కుమారి, ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

తెలుగు, సంస్కృతం కోర్సును కొనసాగించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గతంలో మాదిరిగానే కాంపోజిట్ తెలుగు, సంస్కృతం కోర్సును కొనసాగించాలని సంస్కృత భాషా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వసంతరావు, శశికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం ప్రైవేటు సంస్కృత భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఈఓ సుధాకర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల విద్యలో సంస్కృత భాషను ప్రవేశపెట్టి సుస్థిరతకు సహకరించాలని కోరారు. భాస్కరరెడ్డి, రాము, జమాల్‌బాషా, రవీంద్రారెడ్డి, శ్యాం, దస్తగిరి, శ్రీదేవి, నాగమద్దిలేటి, మధు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులతో కోటేష్

నంద్యాల(అర్బన్): ఆజాదీకా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకొని ఇటీవల హైదరాబాద్‌లోని యంగ్ ఇన్ఫోస్ సంస్థ, భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మద్దతుతో నా మాతృభూమి పేరిట నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. అకాడమీ నుంచి 32 మంది చిన్నారులు బొమ్మలు వేసి పోటీలకు పంపారు. అందులో ఐదుగురికి బంగారు పతకాలు, 11మందికి స్పెషల్ జ్యూరీ అవార్డ్స్, 14మందికి డిప్లొమో అవార్డులు సాధించారు. కొరియర్ ద్వారా అవార్డులు, ప్రశంసా పత్రాలను చిన్నారులకు పంపారని కోటేష్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిలో సాగర్, జ్యోషికారెడ్డి, ప్రణవి, వెంకటనాగనిరూప, శ్వేత ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామ శివారులో ఆదివారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన ఆరుగురు పేకాట ఆడుతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,400 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆరోగ్య ఫలం.. జామపండు

- రోజుకు ఒకటి తింటే సంపూర్ణ ఆరోగ్యం
- జామతో వ్యాధులు దూరం
- మార్కెట్‌లో విస్తారంగా లభిస్తున్న ఫలం



విక్రయానికి సిద్ధంగా ఉన్న జామ కాయలు

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుతం మార్కెట్లో ఎక్కడ చూసినా తాజా జామకాయలే కనిపిస్తున్నాయి. సామాన్యులు మొదలుకొని సంపన్నుల వరకు జామను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తీసుకుంటారు. మార్కెట్లో నాటు రకాలకు చెందిన జామ పండ్లు లభ్యమవుతున్నాయి. కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. హైబ్రిడ్ రకాలతో పోలిస్తే నాటు జామలో పోషకాలు అధికంగా ఉంటాయి.

లాభాలు మెండు..

జామపండుతో అనేక వ్యాధులు దూరమవుతాయి. రోజూ తినడం ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గి ప్రొటీన్లు పెరుగుతాయి. జామలో కొవ్వు కేలరీలు తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరమైనది. జామకాయలో పోషకాలు, విటమిన్‌లు, పీచు పదార్థాలు వంటివి ఉండటం వల్ల సుగర్ వ్యాధి గ్రస్తులు కూడా నిరభ్యంతరంగా తినవచ్చు. జామ పండులో 21శాతం విటమిన్ ఏ ఉంటుంది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచుతుంది. శ్లేష పొరలను నివారించేందుకు సహాయపడుతుంది. ఈ పండులో 20 శాతం ఫోలెట్ ఉండటంతో స్త్రీల నెలసరి సమస్యల పరిష్కారానికి బాగా పనిచేస్తుంది. పింక్ కలర్ జామ పండులో ఉండే లైకోఫిన్ అతి నీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఇది ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది. జామలో పొటాషియం శాతం ఎక్కువగా ఉండటంతో రక్తపోటును కూడా నివారిస్తుంది. నారింజ కంటే జామ పండులో విటమిన్–సీ ఎక్కువగా ఉంటుంది. కాస్త పండిన జామలో లైకోఫిన్ పోషకం ఉండటంతో మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నందువల్లే జామను పేద వాడి యాపిల్‌గా పిలుస్తారు.

జామ ఆకులతో ప్రయోజనాలు..

జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలకు జామ ఆకులు బాగా పని చేస్తాయి. జామ ఆకులను వేడి నీటిలో ఉడకబెట్టి టీ తయారు చేసి తాగవచ్చు. జామ ఆకుల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్, యాంటి ఆక్సిడెంట్ లక్షణాల వల్ల జుట్టు రాలడం, ఆగిపోయిన వెంట్రుకలను బలోపేతం చేసేందుకు సహాయపడుతుంది.

షుగర్ వ్యాధిగ్రస్తులకు మంచిది



ఈ సీజన్‌లో లభించే జామపండు రోజుకు ఒకటి చొప్పున తీసుకుంటే షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. దోర జామ పండు వగరు దంతాలను శుభ్రం చేయడంతో పాటు చిగుళ్ల నుంచి రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఈ పండులో విటమిన్–సీ పుష్కలంగా ఉండటంతో కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జామ ఆకులను ఎండబెట్టి, పొడి చేసి పాలు, నీళ్లలో కలుపుకొని తాగితే అతిసార, నరాల బలహీనతలను నివారించవచ్చు.

– డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్ఓ, నంద్యాల

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో బాధితులకు న్యాయం జరగకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచిడి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

గోస్పాడు: మండలంలోని రైతులకు 9గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు గ్రూపులుగా విభజించి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఏ గ్రూపులో ఎం.చింతకుంట్ల, యాళ్లూరు ఫీడర్ కింద సత్యనారాయణాపురం, దీబగుంట్ల ఫీడర్ కింద మసీదుపురం, మోతుకుల పల్లె ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

అలాగే బి గ్రూపులో గోస్పాడు సబ్ స్టేషన్ పరిధిలో ఒంటి వెలగల ఫీడర్ కింద యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఎం.కృష్ణాపురం, యాళ్లూరు ఫీడర్ల కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, గ్రామాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 6.30 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఉద్యోగులకు ఆటలు కూడా ముఖ్యమే



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: ఉద్యోగులు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఎంతో ఉల్లాసంగా విధులు నిర్వహిస్తారని కోవెలకుంట్ల కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం గుడుపాపల గ్రామం సొసైటీ ఆవరణలో జిల్లా సహకార సంఘం ఉద్యోగలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. బ్యాంకు పరిధిలోని కోవెలకుంట్ల రెండు జట్లు, నంద్యాల, సంజామల నుంచి ఒక్కో జట్టు పోటీల్లో పాల్గొన్నాయి. కోవెలకుంట్ల ప్రథమ, తృతీయ, నంద్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. కోవెలకుంట్ల ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యానారాయణరెడ్డి, సూపర్‌వైజర్లు మహేశ్వరరెడ్డి, సుబ్బరాయుడు, నంద్యాల జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు వీరభద్రుడు, జనరల్ సెక్రటరీ సుబ్బారువు (సీఈఓ), కోశాధికారి అక్తర్‌హుసేన్, సీఈఓలు మనోహర్ రెడ్డి, అబ్దుల్ కలాం, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

కళ్ల కలకలం

- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న 'పింక్ ఐ' కేసులు
- గాలి ద్వారా వేగంగా వ్యాపించే గుణం
- వసతి గృహాల్లో ఎక్కువగా ప్రబలుతున్న కేసులు
- బాధితుల్లో అధిక శాతం విద్యార్థులే
- మరో రెండు వారాలు ఉధృతంగా ఉంటుందన్న వైద్యులు
- తగిన జాగ్రత్తలతో వ్యాప్తిని అరికట్టవచ్చు



సర్వజన ఆసుపత్రిలోని కంటి ఓపీలో వైద్యులకు సూచనలు ఇస్తున్న ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ వరప్రసాదరావు

నంద్యాలటౌన్ : కళ్ల కలక.. ప్రస్తుతం వేగంగా వ్యాపిస్తోంది. దురద, నొప్పి, కళ్లు బాగా ఎర్రబడటం, నీరు కారటం, పొడిబారటం లక్షణాలతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతోంది. జిల్లాలో చిన్న, పెద్ద అనకుండా వ్యాధి సోకుతోంది. ముఖ్యంగా విద్యాలయాలు, హాస్టళ్లు, సమూహాలు అధికంగా ఉండే చోట వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది.

బడుల్లో తగ్గుతున్న హాజరు శాతం..

ప్రాంతాన్ని బట్టి పింక్ ఐ, మద్రాస్ ఐ.. గా పిలిచే ఈ కళ్ల కలక ప్రాణాంతకం కాకపోయినా.. విపరీతమైన చిరాకు పుట్టిస్తుంది. జిల్లా కేంద్రమైన నంద్యాలతో పాటు ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనాగణపల్లె, డోన్ తదితర ప్రాంతాల్లో కళ్ల కలకతో వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కళ్ల కలక బారిన పడటంతో హాజరు శాతం కూడా తగ్గిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగు తోందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. నంద్యాల సర్వజన అసుపత్రిలో రోజుకు దాదాపు వంద మంది వరకు కళ్ల కలకల బాధితులు ఓపీకి వస్తున్నారు. కేసుల ఉధృతి ఎక్కువగా ఉందని, రెండు వారాల పాటు ఇలాగే కొనసాగొచ్చని వైద్యులు చెబుతున్నారు. కళ్ల కలక వచ్చిన వారిలో ఎక్కువ శాతం విద్యార్థులే ఉంటున్నారు. కళ్లకలకపై సరైన అవగాహన లేకపోడం వలన వసతి గృహాల్లో ఎక్కువగా ప్రబలుతుందని వ్యాధి సోకిన విద్యార్థిని ప్రత్యేకంగా ఉంచి చికత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

- కళ్ల కలక ఎడినోవైరస్ వల్ల సంక్రమిస్తుంది. ముఖ్యంగా ఇది వర్షాకాలంలోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల ఎడినో వైరస్ యాక్టివేట్ ఒక ప్రాంతమంతా వ్యాపించే అవకాశం ఉంది. దీన్ని అడినోవైరల్ ఇన్‌ఫెక్షన్ అని కూడా అంటారు. సాధారణంగా ఈ వ్యాధి వైరల్ కంజెక్టిటిస్, బ్యాక్టీరియా కంజెక్టివిటిస్, అలర్జిక్ కంజెక్టివిటిస్ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకడం వల్ల కళ్లు ఎరబ్రారడం, ఉబ్బటం, రెప్పలు వాయడం, వెలుగును చూడలేక పోవడం, కంటి నుంచి నీరు కారడం, రెప్పలు అతుక్కుపోవడం, చూపు కూడా కొంత మసక బారడంతోపాటు జ్వరం కూడా వస్తుంది.

వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు..

- కళ్ల కలక బారినపడిన వారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇతరులకు వ్యాపించకుండా నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.
- వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నల్ల కళ్ల జోడు వాడాలి. ఇతరులకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి.
- కరచాలనం చేయడం, తాకడం మానుకోవాలి.
- చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- కంటిని నులమడం, రుద్దడం లాంటివి చేయకూడదు. కళ్ల కలకతో బాధపడే వారు వాడిన సబ్బు, బెడ్‌షీట్లు, టవళ్లు ఇతరులు వినియోగించకూడదు.
- కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు కళ్ల కలక బారినపడితే రెండు లేదా మూడు రోజులు సెలవు పెట్టడం మంచిది.
- కళ్ల కలక బాధితుల దగ్గరకు చిన్నారులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి నయమయ్యే వరకు కాస్మొటిక్స్ వాడటం ఆపేయాలి.

తేలిగ్గానే నయం చేసుకోవచ్చు...

కళ్ల కలక సోకిన వారు చిన్నపాటి చికిత్సతోనే వ్యాధిని నయం చేసుకోవచ్చు. ఎక్కువగా మందులు వాడాల్సిన పని ఉండదు. కళ్లను శుభ్రంగా కడుక్కోవడంతో పాటు లూబ్రికేషన్ డ్రాప్స్ లేదా యాంటీబయోటిక్ చుక్కల మందు లేదా అయోడిన్ డ్రాప్స్, ఆయిట్‌మెంట్‌లను వైద్యులను సంప్రదించి మాత్రమే వాడాలి. కళ్ల జోడు పెట్టుకుంటే ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందకుండా ఉంటుంది. తగిన జాగ్రత్తలు పాటిస్తే రెండు మూడు రోజుల్లో వ్యాధి తగ్గిపోతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

కళ్ల కలక బారినపడిన వారు కళ్లను తరచూ మంచి నీటితో కడుక్కోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మురికిగా ఉన్న చేతులతో కళ్లను తాకకూడదు. సబ్బు నీటితో తరచూ చేతిని కడుక్కోవాలి. కళ్లు దురదగా అనిపిస్తే పదే పదే రుద్దకూడదు. శుభ్రమైన కాటన్ క్లాత్‌తో తుడుచుకోవాలి. గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది కాబట్టి ఇతరులకు దూరంగా ఉండాలి. డాక్టర్ సూచనల ప్రకారం ఐ డ్రాప్స్ వాడాలి. ఆఫీసుల్లో, స్కూళ్లలో, కళాశాలల్లో ఎవరికైనా కళ్ల కలక ఉంటే వారికి కాస్త దూరంగా ఉండటం మేలు.

– డాక్టర్ వరప్రసాద రావు, సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి నంద్యాల

ప్రబలుతున్న గొంతువాపు వ్యాధి

- మృత్యువాత పడుతున్న గేదెలు
- టీకాలు వేయించాలంటున్న అధికారులు



రుద్రవరంలో గొంతువాపు వ్యాధితో మృతి చెందిన గేదె

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో పశువుల్లో గొంతు వాపు వ్యాధి ప్రబలుతోంది. వ్యాధి బారిన పడి గేదెలు మృత్యువాత పడుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం ఆరంభమైనప్పటి నుంచి పశువుల్లో గొంతు వాపు వ్యాధి మొదలైంది. అక్కడక్కడ పశువులు మృతి చెందడంతో పశు వైద్యాధికారులు గొంతు వాపు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టారు. మండలంలోని 21 గ్రామ పంచా యతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి టీకాలు వేశారు. అయితే కొందరు అందుబాటులో లేక పోవడం, మరి కొందరు రైతులు టీకాలు వేయిస్తే పాల దిగుబడి తగ్గుతుందనే అపోహలతో టీకాలు వేయించ లేదు. అలా టీకా వేయించని గేదెల్లో ప్రస్తుతం వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మండల కేంద్రానికి చెందిన మొర్సు సుబ్రహ్మణ్యం అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. అలాగే ఆర్.కొత్తూరులో మరో గేదె మృతి చెందింది. ఈ విషయంపై పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్‌ను వివరణ కోరంగా.. మండలంలో మొత్తం 1,190 గేదెలు ఉండగా 1,050కి గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. మిగిలిన వాటికి రైతులు వేయించలేదన్నారు. రుద్రవరంలోమృతి చెందిన గేదెను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆర్.కొత్తూరులో మృతి చెందిన గేదె గొంతు వాపు వ్యాధితో కాదని టెంపరేచర్ ప్రభావంతో మృతి చెందిందని చెప్పారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ నాయకులు నరసింహులు మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ కోరారు. స్థానిక ఎంఈఎఫ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎంఈఎఫ్, ఎంహెచ్‌పీ, ఎంఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బిక్ష మాదిగ ముఖ్యఅతిథిగా హాజరైన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించడం కోసం మహాసభను నిర్వహిస్తున్నామని చెప్పారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం

నంద్యాల(వ్యవసాయం): ధ్యానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యంగా ఉండవచ్చని ఆధ్యాత్మిక ప్రవచన గురువు జ్ఞాన ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మశాల గీతా భవన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం నువ్వు బాగుండాలని–నీ ప్రపంచం బాగుండాలని అంశంపై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన రుషి పరంపరను అలవర్చుకోవడం వల్ల సకల సుఖాలను పొందుతామన్నారు. జ్ఞానం, శక్తితో కుటుంబంలోను, తన పనిలోను విజయం పొందడం సులువు అవుతుందన్నారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం నాయకులు తిమ్మయ్య, భవనాశి వాసు ఆయనను ఘనంగా సత్కరించారు.



ప్రవచనాలు వినిపిస్తున్న ఆధ్యాత్మిక గురువు జ్ఞాన ప్రసాద్

దాడులు సహించం

నంద్యాల(అర్బన్): సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం వెంకటరమణ పల్లెలో వడ్డెరులపై జరిగిన దాడులు హేయమైనవని భవిష్యత్‌లో దాడులు జరిగితే సహించేది లేదని, ఏపీ వడ్డెర సంఘం జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేష్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయ ఆవరణలో ఆదివారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. వెంకటరమణపల్లెలో జరిగిన దాడిలో 8మంది వడ్డెరుల పరిస్థితి విషమంగా ఉందన్నారు. సంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



గంగులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో కొలువైన మూల పెద్దమ్మ అమ్మవారిని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామనాయకులు జాకీర్‌బాషా, ఆశాబీ, కరీముల్లా, రఫీ, కృష్ణారెడ్డి, డీలర్ పెద్దన్న , శివ ప్రసాద్, శాంతయ్య ఆయనకు ఘనస్వాగతం పలికారు. పెద్దమ్మ దర్శనం అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు.

గద్దర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రజా యుద్ధ నౌక, విప్లవ గాయకుడు గద్దర్‌కు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ గద్దర్ మరణం సాంస్కృతిక రంగానికి, కళారంగానికి తీరని లోటన్నారు. పీడీఎస్‌యూ అధ్యక్షుడు రఫీ, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, మహమ్మద్, ఖాజామియా, రఫీ, సామేలు, బాలాజీ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులకు జీతాలు పెంచాలని, ఏడాది కాలంగా 1104 సారథ్యంలో పవర్ జేఏసీ 23సార్లు జాయింట్‌గాను, విడివిడిగా సమావేశం జరిపిందన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు జేఎల్ఎం–2 సమస్యల పరిష్కారంలో పవర్ జేఏసీ విఫలమైందన్నారు. తక్షణమే విద్యుత్ రంగంలో రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. దేశ వ్యాప్తంగా నేషనల్ కో ఆర్డినేషన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ పోరాడి విద్యుత్ ప్రైవేటీకరణను ఆపగలిగిందన్నారు. విద్యుత్ కార్మికులకు మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

చేనేతలను ప్రోత్సహించాలి

నంద్యాల(న్యూటౌన్): భారతీయ చేనేతలను ప్రోత్సహించాలని నంద్యాల డయాసిస్ అధ్యక్షురాలు రైట్ రెవ రెండ్ బిషప్ ఎగ్గోని పుష్పలలిత అన్నారు. ఆదివారం సాయంత్రం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో ఏర్పాటు చేసిన భారత్ క్రాఫ్ట్ ప్రదర్శనను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో చేనేత వస్తువులకు మంచి ఆదరణ ఉందన్నారు. అలాగే చేతి వృత్తులను కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న బిషప్ పుష్పలలిత

రెడ్‌క్రాస్‌కు పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రెడ్‌క్రాస్‌కు అరుదైన పురస్కారం లభించింది. నంద్యాల జిల్లాలోని 8 విద్యాసంస్థలకు చెందిన 5 వేల మందికి పైగా విద్యార్థులతో రక్తదానం చేయించడంపై ఢిల్లీకి చెందిన సామాజిక కార్యకర్త, దేశ వ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాక్‌ఫర్ బ్లడ్ కిరణ్‌వర్మ పంపిన పురస్కారాన్ని నంద్యాల రెడ్‌క్రాస్ సభ్యులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు దస్తగిరి మాట్లాడుతూ కిరణ్‌వర్మ దేశ గత ఏడాది నవంబర్‌లో నంద్యాలను సందర్శించి సేవలను గుర్తించారని చెప్పారు.

ముమ్మరంగా భూ రీసర్వే



గంగవరంలో జరుగుతున్న భూ రీ సర్వే

శిరివెళ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ సర్వే- భూ హక్కు కార్యక్రమం మండలంలోని గంగవరంలో తుది దశకు చేరుకుంది. వివిధ రెవెన్యూ భూ రికార్డుల ఆధారంగా రైతుల సమక్షంలోనే రీ సర్వే పక్కాగా జరుగుతుంది. 6 నెలల కితం గ్రామంతో పాటు భూములను ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా మ్యాప్ తీయించారు. దాని ఆధారంగా సర్వే చేస్తున్నారు.. గ్రామంలో మొత్తం 1,636 ఎకరాల భూమి ఉండంగా అందులో 150 ఎకరాలు ప్రభుత్వ భూములు, గ్రామం, వంకలు, వాగులు, చెరువు ఉంది. చెరువు ఒకటే 75 ఎకరాలు ఉంది. రీ సర్వేకు 4 గ్రామ సచివాలయాల సర్వేలను నియమించారు. తహసీల్దార్, మండల సర్వేయర్ పర్యవేక్షణలో రీ సర్వే జరుతోంది. ప్రతి రైతుకు సంబంధించిన భూమిని రికార్డుల ఆధారంగా రైతు సమక్షంలోనే కొలుస్తున్నారు. వారి నుంచి అంగీకార పత్రాలను తీసుకుంటున్నారు. 901 మంది రైతులకు గాను 507 మంది రైతుల భూములను రీ సర్వే చేశారు. వారంలోపు సర్వే పూర్తి కానుంది. సర్వే అనంతరం ఆన్‌లైన్ చేస్తారు. ఆన్‌లైన్ ఆధారంగా రైతులకు భూ హక్కు పత్రాలను (పట్టాదారు పాస్ పుస్తకాలు) పంపిణీ చేస్తారు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ మాట్లాడుతూ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా గోవిందపల్లెలో భూ సర్వే జరిగింది. రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కూడ పూరయ్యాయి. ప్రస్తుతం గంగవరంలో రీ సర్వే జరుగుతోంది. కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని చెప్పారు.



వరి నారుమడి వద్ద నారును సిద్ధం చేస్తున్న మహిళా కూలీలు



మాయలూరు గ్రామ సమీపంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఆశలు పండేలా..

- జోరందుకున్న వరినాట్లు

ఉయ్యాలవాడ : పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఇటీవల కుందూనదికి ప్రజా ప్రతినిధులు, అధికారులు నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో కుందూ నదికి నీరు వచ్చి చేరుతుందన్న ఆశలతో ఖరీఫ్ సీజన్‌లో కోటి ఆశలతో అన్నదాతలు సాగుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది వాతావరణం అన్ని విధాలా అనుకూలించడం, సాగు నీరు పంట చేతికి అందే వరకు కుందూలో పుష్కలంగా లభించింది. దీంతో ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు వరి దిగుబడులు చేతికందాయి. నాలుగు సంవత్సరాలుగా కుందూనదిలో నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో మండలంలోని 14 గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో కూడా 1,100 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ఈ ఏడాది కూడా నదీ తీరం వెంటనున్న గ్రామాలు అల్లూరు, మాయలూరు, నర్సిపల్లె, హరివరం, సుద్దమల్ల, ఉయ్యాలవాడ, ఇంజేడు, బోడెమ్మనూరు, తదితర గ్రామాల్లో వరి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం నారుమళ్లలో నారు పెరిగిపోవడంతో వరి నాట్లు వేసే పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు.

దొర్నిపాడు: కుందూ వెంట వరి నాట్ల సందడి నెలకొంది. ప్రస్తుతం వరి పంటకు సరిపడ నీళ్లు నదిలో ఉండటంతో రైతులు ధైర్యంగా వరి నాట్లు వేస్తున్నారు. అంతేగాక వడ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో సాగుకు ముందుకొస్తున్నారు. ఇక పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చేయడంతో నదిలో నీటి ప్రవాహం మొదలైంది. కొద్ది రోజులు ఆలస్యమైనా పంట సాగుకు సరిపడ నీరు అందుతుందనే ధైర్యంతో పంట సాగు చేస్తున్నారు. నాట్లు మొదలవడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ఎకరం నాటు వేస్తు సుమారు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఇస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు.



క్రిష్టిపాడులో కుందూ వెంట వరి నాట్లు వేస్తున్న దృశ్యం



నారు కట్టలను విసురుతున్న కూలీ